సాక్షి
విశాఖపట్నం
బుధవారం, 21, జూన్, 2023



చిరుజల్లులతో కూల్‌కూల్

మంగళవారం రాత్రి వర్షం కురవడంతో ప్రజలు ఉపశమనం పొందారు. విశాఖ చల్లబడడంతో ఊపిరిపీల్చుకున్నారు. 8లో



యోగామార్గం..ఆరోగ్య భాగ్యం

ఆరోగ్యం, మానసిక దృఢత్వానికి యోగ ఎంతో మేలు చేస్తుంది. సర్వరోగ నివారిణిగా పనిచేస్తుంది. 8లో



రోగులకు 'సుభోజనం'

హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రిలో రోగులు, సహాయకులకు సుభోజనం ఇస్కాన్, టచ్‌స్టోర్ చారిటీస్ సౌజన్యంతో ప్రారంభించారు. 8లో

న్యూస్‌రీల్

22న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు రాక

మహారాణిపేట: మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ఈ నెల 22న విశాఖ వస్తున్నారు. హైదరాబాద్ నుంచి విమానంలో బయలుదేరి ఉదయం 10.20 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ నుంచి నేరుగా విశాఖ పోర్టు గెస్ట్‌హౌస్‌కు వస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు పోర్టు గెస్ట్‌హౌస్ నుంచి బయలుదేరి సాగర్‌నగర్‌లోని ఇంటికి చేరుకుంటారు. సాయంత్రం 6.30 గంటలకు పోర్టు గెస్ట్‌హౌస్‌కు చేరుకుని రాత్రికి అక్కడే బస చేస్తారు. 23న ఉదయం 8.25 గంటలకు సాగర్‌నగర్‌లోని విజయ శంకర్ ఇంటికి వెళ్తారు. 10.30 గంటలకు రుషికొండ ఏ వన్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2.30గంటలకు తిరిగి పోర్టు గెస్ట్‌హౌస్‌కు చేరుకుని రాత్రికి అక్కడే బస చేస్తారు. 25న సాయంత్రం నాలుగున్నర గంటలకు అనకాపల్లి జిల్లా వి.వి.రమణ రైతు భారతి కల్యాణ మండపంలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. 26న ఉదయం 7.30గంటలకు విమానంలో హైదరాబాద్ బయలు దేరుతారు.

ఖైదీలకు వైద్య పరీక్షలు



మాట్లాడుతున్న జైలు సూపరింటెండెంట్ కిశోర్ కుమార్

ఆరిలోవ: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి విశాఖ కేంద్ర కారాగారంలో మంగళవారం వైద్య శిబిరం ప్రారంభించింది. రెండు రోజుల పాటు కొనసాగే ఈ శిబిరంలో సుమారు 1,700 మంది ఖైదీలకు హెచ్‌ఐవీ, టీబీ, హెపటైటిస్–బి తదితర పరీక్షలు చేస్తున్నారు. ఖైదీల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ఈ శిబిరం ఏర్పాటు చేసినట్లు జైలు సూపరింటెండెంట్ కిశోర్‌కుమార్ తెలిపారు. ఎవరికైనా ఆయా వ్యాధులకు సంబంధించిన లక్షణాలు బయటపడితే వెంటనే వైద్యం అందిస్తామన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు, వైద్య, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

అప్పన్న హుండీ ఆదాయం రూ.2.23 కోట్లు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి హుండీ ఆదాయం గడిచిన 32 రోజులకు గాను 2కోట్ల 23లక్షల 32వేల 228 రూపాయలు వచ్చినట్టు ఈవో డి.భ్రమరాంబ తెలిపారు. సింహగిరిపై స్వామివారి ఆలయ బేడా మండపంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు స్వామివారి హుండీ ఆదాయాన్ని లెక్కించారు. నగదుతో పాటు 206 గ్రాముల బంగారం, 16.732 కిలోల వెండి లభించినట్టు ఈవో పేర్కొన్నారు. దేవస్థానం అధికారులు, సిబ్బంది లెక్కింపులో పాల్గొన్నారు. అలాగే దేవస్థానం అనుబంధ దేవాలయం పైడితల్లి ఆలయ హుండీ ఆదాయం 8 లక్షల 8వేల 740 రూపాయలు వచ్చినట్టు తెలిపారు.

16న విశాఖలో బీసీ గర్జన



వైవీ సుబ్బారెడ్డిని ఆహ్వానిస్తున్న కర్రి వేణుమాధవ్

బీచ్‌రోడ్డు: జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జూలై 16న విశాఖలో భారీ బీసీ గర్జన నిర్వహిస్తున్నట్లు సంఘ అధికార ప్రతినిధి కర్రి వేణుమాధవ్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం టీటీడీ చైర్మన్, వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డిని కలిసి ఈ కార్యక్రమానికి ఆహ్వానించారు. సంఘం ఏర్పాటు చేసి 50 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా భారీ ఎత్తున బీసీ గర్జన నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో భాగంగా సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణకు స్వర్ణకంకణ ధారణ చేస్తున్నట్లు తెలిపారు.

ప్లాస్టిక్ వినియోగంపై చర్యలు

దాబాగార్డెన్స్: నిషేధిత ప్లాస్టిక్ వినియోగించే వారిపై చర్యలు తప్పవని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ హెచ్చరించారు. జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. మంగళవారం 35 దుకాణాల నుంచి 191.6 కేజీల నిషేధిత ప్లాస్టిక్‌తో పాటు రూ.69,800 అపరాధ రుసుం వసూలు చేశామన్నారు.

జై జగన్నాథ్





అశేష జనవాహిని నడుమ ఊరేగింపుగా వస్తున్న జగన్నాథస్వామి (ఇన్‌సెట్) రథంపై జగన్నాథుడు

- కదిలిన జగన్నాథ రథచక్రాలు
- నగరానికి ఆధ్యాత్మిక శోభ



కోలాటం ఆడుతున్న చిన్నారులు

విశాఖ నగరం మంగళవారం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. సంకీర్తనలు.. కోలాటాలు. భజనలు.. విష్ణు సహస్రనామ పారాయణ.. వేదమంత్రాలు.. మంగళ ధ్వనులతో పులకించింది. ఎక్కడ చూసినా భక్తుల సందడే. 185 ఏళ్ల ఘన చరిత్ర గల టౌన్‌కొత్తరోడ్డు జగన్నాథస్వామి ఆలయంలో రథయాత్ర కనులపండువగా ప్రారంభమైంది. జిల్లా పరిషత్ శ్రీకృష్ణ మందిర్ ఆధ్వర్యంలో నిర్వహించిన రథయాత్ర అంగరంగ వైభవంగా సాగింది. సాయంత్రం 4 గంటలకు ఇస్కాన్ నగర శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రథయాత్రకు భారీగా భక్తులు తరలివచ్చారు.



రథయాత్రను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, దేవదాయ శాఖ సహాయ కమిషనర్ శిరీష

టౌన్ కొత్తరోడ్డులో రథయాత్ర సాగిందిలా..

దాబాగార్డెన్స్ : జగన్నాథస్వామి రథయాత్ర సాయంత్రం 5.10 గంటలకు ప్రారంభమైంది. అక్కడి నుంచి వేద మంత్రాలు..గీతాపారాయణ. మేళతాళాలు.. కోలాటం నడుమ వైభోవపేతంగా రథయాత్ర సాగింది. టౌన్‌కొత్తరోడ్డు వద్ద ప్రారంభమైన రథయాత్ర ఏవీఎన్ కాలేజ్ డౌన్‌రోడ్డు, పూర్ణామార్కెట్, ఆంజనేయస్వామి ఆలయం మీదుగా టర్నర్ చౌల్ట్రీ వరకు సాగింది. అనంతరం స్వామిని టర్నర్ చౌల్ట్రీలోని కల్యాణమండపం లోకి ఆహ్వానించారు. అక్కడ రోజుకో దివ్యావతారంతో జగన్నాథుడు భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి టి.రాజగోపాల్‌రెడ్డి నేతృత్వంలో దక్షిణ నియోజక వర్గ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ రథయాత్రను ప్రారంభించారు. దేవదాయ ధర్మదాయ శాఖ సహాయ కమిషనర్ కె.శిరీష, కనక మహాలక్ష్మి దేవస్థానం చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు కార్పొరేటర్లు, పలువురు ప్రముఖులు స్వామిని దర్శించుకుని, రథయాత్రలో పాల్గొన్నారు.



'ఇస్కాన్' సారథ్యంలో రథోత్సాహం



సుభద్ర,బలభద్ర సమేత జగన్నాథుడు



రథయాత్రను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఇస్కాన్ ప్రతినిధి సాంబదాస



రథయాత్ర ప్రాంగణంలో ముగ్గులు వేస్తున్న మహిళలు

దాబాగార్డెన్స్ : జగన్నాథుని రథయాత్ర ఉత్సవాలు ఇస్కాన్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. సాగర్‌నగర్ ఇస్కాన్ శాఖ అధ్యక్షుడు సాంబదాస్, మాతాజీ నితాయి సేవని సారథ్యంలో జగన్నాథస్వామి రథయాత్ర కనుల పండువగా సాగింది. సాయంత్రం 4 గంటలకు 4 రథాలతో రథయాత్ర నిర్వహించారు. రథయాత్రను ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, సెంచూరియన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య జీఎస్ఎన్ రాజు, పేడాడ రమణకుమారి, యువశ్రీ, పలువురు ప్రముఖులు ప్రారంభించారు. ప్రభుత్వ మహిళా కళాశాల నుంచి ఎల్ఐసీ అంబేడ్కర్ విగ్రహం, డాబాగార్డెన్స్, ప్రకాశరావుపేట, జగదాంబ జంక్షన్, వైఎస్సార్ విగ్రహ కూడలి, వాల్తేర్ అప్ రోడ్డు, ప్రభుత్వ సర్క్యూట్ హౌస్ మీదుగా సిరిపురం గురజాడ క్షేత్రం వరకు సాగింది. అనంతరం గురజాడ కళాక్షేత్రంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథస్వామిని అధిష్ఠింపజేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జగన్నాథుడి ఔన్నత్యంపై సాంబదాస్, జగన్నాథుని లీలలపై మాతాజీ నితాయి సేవిని ప్రవచించారు. భక్తులు తయారు చేసిన 1008 రకాల ప్రసాదాలను స్వామికి నివేదన చేశారు. అనంతరం భక్తులకు వితరణ చేశారు. ఈ సందర్భంగా ఇస్కాన్ శాఖ అధ్యక్షుడు సాంబదాస్, మాతాజీ నితాయి సేవని మాట్లాడుతూ విశాఖ మహానగరంలో వరుసగా 16వ సారి అత్యంత వైభోవపేతంగా నిర్వహించినట్టు చెప్పారు. రథయాత్ర అలంకరణ ఒడిశాలోని పిప్పిలి నుంచి ప్రత్యేక సామగ్రి తీసుకువచ్చామన్నారు. రథయాత్రలో బెంగాల్, ఒడిశా నుంచి వచ్చిన భక్తుల నృత్యాలు, కోలాటాలతో అలరించారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్స్ ఎంవీ రాజశేఖర్, రఘువంశి, ఇస్కాన్ జీవితకాల సభ్యులు, అర్చకులు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ఉత్కల్ సమాజ్ ఆధ్వర్యంలో నేత్రపర్వంగా..



రథం లాగుతున్న భక్తులు



భక్తులతో, సమాజ్ సభ్యులతో కలిసి రథాన్ని లాగుతున్న డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి

బీచ్‌రోడ్డు : ఉత్కల్ సాంస్కృతిక సమాజ్ ఆధ్వర్యంలో జగన్నాథ రథయాత్ర మంగళవారం ఘనంగా నిర్వహించారు. దసపల్లా హిల్స్‌లోని జగన్నాథ స్వామి దేవాలయం నుంచి జగన్నాథుడు, బలభద్రుడు, దేవి సుభద్ర దేవతలతో ప్రారంభమైన రథయాత్ర సిరిపురం, హెచ్‌పీసీఎల్, ఏయూ ఔట్ గేట్, చిన్న వాల్తేరు, వుడా పార్క్, శాంతి ఆశ్రమం మీదగా లాసన్స్ బే కాలనీలోని శ్రీ గుండిడా ఆలయం వరకు సాగింది. ఒడిశా సంస్కృతి నృత్య ప్రదర్శనలు అలరించాయి. సమాజ్ అధ్యక్షుడు జితేంద్ర కుమార్ నాయక్, వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ అనూప్‌కుమార్ సత్పతి, ఏడీఆర్ఎం(ఆపరేషన్స్) మనోజ్ కుమార్ సాహూ, సమాజ్ ప్రెసిడెంట్ జేకే నాయక్, సెక్రటరీ బిమల్ మహంత పాల్గొన్నారు.

మన ఆణిముత్యాలు

పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విశాఖ జిల్లా విద్యార్థులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా రాష్ట్ర స్థాయి జగనన్న ఆణిముత్యాల పురస్కారాలు అందుకున్నారు. విజయవాడలో మంగళవారం ఈ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. పదో తరగతిలో జిల్లాకు చెందిన గండి జ్ఞానేంద్ర, ఎ. తారక్‌రామ్, కామిరెడ్డి హేమశ్రీ రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి రూ.లక్ష చొప్పున అందుకున్నారు. ఎస్.ఎం.ప్రియాంక, జామి కల్పన, నమ్మి భారతి ద్వితీయ బహుమతి రూ.75 వేలు చొప్పున, ఈర్ల రేవతి, సింగంపల్లి జయశ్రీ, పూడి మణికంఠస్వామి తృతీయ బహుమతి రూ.50 వేలు చొప్పున అందుకున్నారు. ఇంటర్‌లో వి.శ్వేతకుమారి లక్ష రూపాయల పురస్కారం అందుకోగా.. ఏయూకు చెందిన పి.శ్రీలక్ష్మి సౌమ్య, గాయత్రి ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ప్రదీప్ వర్మ ఇన్నోవేషన్ అవార్డులు పొందారు.



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా నగదు బహుమతి, ప్రశంసాపత్రం అందుకుంటున్న పదో తరగతిలో ప్రతిభ చూపిన గండి జ్ఞానేంద్ర, ఎ. తారక్‌రామ్, కామిరెడ్డి హేమశ్రీ (ప్రథమ స్థానం), ఎస్.ఎం.ప్రియాంక, జామి కల్పన, నమ్మి భారతి (ద్వితీయ) ఈర్ల రేవతి, సింగంపల్లి జయశ్రీ, పూడి మణికంఠస్వామి (తృతీయ), ఇంటర్‌లో వి.శ్వేతకుమారి (ఎడమ నుండి కుడి వైపునకు)



స్వామీజీ లీలలు



పూర్ణానంద సరస్వతి స్వామీజీ

- మరో మైనర్ బాలికపై కూడా పూర్ణానంద సరస్వతి అఘాయిత్యం
- పోలీసుల దర్యాప్తులో విస్తుపోయే వాస్తవాలు
- దిశ పోలీసుల అదుపులో స్వామీజీ

దొండపర్తి(విశాఖ దక్షిణ): ఆశ్రమం ముసుగులో పూర్ణానంద సరస్వతి స్వామీజీ సాగించిన లీలలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. అధ్యాత్మికత పేరుతో సాగించిన అకృత్యాలు విస్తుగొలుపుతున్నాయి. అనాథ బాలికలకు ఆశ్రయం కల్పించే నేపంతో చేసిన దారుణాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడవుతున్నాయి. ఆశ్రమంలో మరో మైనర్ బాలికపై కూడా అఘాయిత్యానికి పాల్పడినట్లు తెలుస్తోంది. దీంతో పోలీసులు ఈ వ్యవహారంపై మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. వెంకోజీపాలెం ప్రాంతంలో దశాబ్దాల క్రితం ఏర్పాటైన జ్ఞానానంద ఆశ్రమాన్ని పూర్ణానంద సరస్వతి స్వామీజీ నిర్వహిస్తున్నారు. ఒకవైపు అధ్యాత్మికత బోధనలతో పాటు తల్లిదండ్రుల నుంచి దూరమైన, అనాథ పిల్లలకు ఆశ్రయం కల్పిస్తున్నారు. అయితే ఈ ఆశ్రమంపై గత కొన్నేళ్లుగా అనేక ఆరోపణలు వినిపిస్తూనే ఉన్నాయి. తాజాగా ఆ ఆశ్రమం నుంచి తప్పించుకున్న బాలిక(15) స్వామీజీ గత రెండేళ్లుగా తనపై అఘాయిత్యానికి పాల్పడ్డారని పోలీసులకు చేసిన ఫిర్యాదు ఇప్పుడు కలకలం రేపుతోంది. ఆమె ఫిర్యాదుతో పేర్కొన్న వివరాల ప్రకారం

గొలుసులతో కట్టేసి రెండేళ్లుగా అఘాయిత్యం

రాజమండ్రికి చెందిన బాలిక తల్లిదండ్రులు చనిపోవడంతో ఆమె పెద్దమ్మ విశాఖకు తీసుకువచ్చి జ్ఞానానంద ఆశ్రమంలో చేర్పించింది. అక్కడ స్వామీజీ ఈ బాలికతో పాటు మరికొంత మంది బాలికలతో పశువుల నిర్వహణ చేయిస్తున్నారు. ఇదిలా ఉండగా రోజూ రాత్రి 12 గంటలకు ఆ మైనర్ బాలికను బలవంతంగా గదిలోకి తీసుకువెళ్లి గొలుసులతో కట్టేసి అఘాయిత్యం చేసేవాడు. కొన్నిసార్లు స్వామీజీని నిలువరించే ప్రయత్నం చేస్తే కొట్టి హింసించేవాడు. ఇలా రెండేళ్ల పాటు బాలిక నరకయాతన అనుభవించింది.

పనిమనిషి సాయంతో బయటపడి..

ఈ నెల 13వ తేదీన పనిమనిషి గొలుసులు విప్పిడంతో బాలిక ఆశ్రమం నుంచి తప్పించుకుంది. ఆమె ఇచ్చిన డబ్బులతో రైల్వేస్టేషన్‌కు వెళ్లి తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కింది. రైలులో ఒక ప్రయాణికురాలు బాలికను గమనించి మాట్లాడగా ఆశ్రమంలో జరిగిన విషయాన్ని ఆమెకు వివరించింది. దీంతో ఆమె కృష్ణా జిల్లాలో కంకిపాడులోని తన సోదరి ఇంటికి తీసుకువచ్చింది. స్థానికుల సలహా మేరకు బాలికను హాస్టల్‌లో చేర్పేందుకు ప్రయత్నించింది. పోలీస్‌స్టేషన్ నుంచి లేఖ తీసుకువస్తే హాస్టల్ చేర్చుకుంటామని చెప్పారు. దీంతో వారు బాలికతో కంకిపాడు స్టేషన్‌కు వెళ్లగా పోలీసులు బాలిక నుంచి వివరాలు తెలుసుకొని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ దృష్టికి తీసుకువెళ్లారు. కమిటీ సభ్యులు బాలిక నుంచి వివరాలు సేకరించారు. అనంతరం పోలీసులు అక్కడ జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. బాలికను వైద్య పరీక్షల నిమిత్తం అక్కడి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. కేసును ఎంవీపీ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు.

మరో బాలికపై కూడా అఘాయిత్యం

విశాఖ పోలీస్ ఉన్నతాధికారులు కేసును దిశ స్టేషన్‌కు బదిలీ చేశారు. పోలీసుల విచారణలో విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. గతంలో కూడా మరో బాలికపై స్వామీజీ అఘాయిత్యానికి పాల్పడినట్లు పోలీసుల దర్యాప్తులో తెలిసింది. దీంతో పోలీసులు ఆ ఆశ్రమంలో తనిఖీలు చేయగా పిల్లల ఆశ్రయానికి అనువైన పరిస్థితులు లేనట్లు గుర్తించారు. అలాగే ఇప్పటి వరకు ఎంత మంది పిల్లలు ఆశ్రమంలో ఆశ్రయం పొందారు? ఏయే పరిస్థితుల్లో బయటకు వెళ్లారు? వారితో స్వామీజీ వ్యవహరించిన తీరు? ఇలా లోతుగా దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.

స్వామీజీపై కొన్నేళ్లుగా ఆరోపణలు

ఆశ్రమ నిర్వహణ, పూర్ణానంద సరస్వతి స్వామీజీ వ్యవహార శైలిపై గత కొన్నేళ్లు ఆరోపణలు వినిపిస్తూనే ఉన్నాయి. వాస్తవానికి 1955లో జ్ఞానానంద భారతి అనే స్వామిజీ ఇక్కడ ఆశ్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు అనాథ పిల్లలు, తల్లిదండ్రులచే నిర్లక్ష్యం చేయబడిన, అనారోగ్యంతో ఉన్న పిల్లలను చేరదీసి ఆశ్రయం కల్పించారు. వారికి విద్యాబోధనతో పాటు ఆధ్యాత్మిక చింతన కలిగేలా శ్లోకాలు నేర్పించేవారు. ఇదిలా ఉంటే ఉత్తరాంధ్రకు చెందిన పూర్ణానంద సరస్వతి(అసలు పేరు వేరు) విశాఖలో ఉంటూ పోస్టు గ్రాడ్యుయేషన్ చేసినట్లు తెలుస్తోంది.

తొలినాళ్లలో వెంకోజీపాలెంలో ఒక ఇంటిని అద్దెకు తీసుకొని పిల్లలకు ట్యూషన్ చెప్పేవాడు. ఆశ్రమానికి వెళుతూ అప్పటి స్వామీజీకి సపర్యలు చేస్తూ, చిన్న చిన్న పనులు చేస్తుండడంతో ఆయనతో సాన్నిహిత్యం పెరిగింది. దీంతో అతడు ఆశ్రమంలో ఉంటూ అక్కడి కార్యకలాపాలు చూసుకునేవాడు. 1984లో పూర్ణానంద సరస్వతి ఆశ్రమ బాధ్యతలు స్వీకరించినట్లు తెలుస్తోంది. అప్పటి నుంచి కొన్నాళ్ల పాటు పిల్లలను చేరదీసి వారికి పాఠశాల విద్యను అందించేవారు. అయితే ట్యూషన్లు చెప్పే సమయంలోనే బాలికలతో అసభ్యకరంగా ప్రవర్తించేవాడని పలువురు ఆరోపణలు చేసిన సందర్భాలు ఉన్నాయి. ఇదిలా ఉంటే కొన్నేళ్ల క్రితం కూడా ఇదే తరహా ఆరోపణలు పెద్ద దుమారాన్ని రేపాయి.

పోలీసుల అదుపులో స్వామీజీ

తాజాగా మైనర్ బాలిక ఫిర్యాదుతో మరోసారి పూర్ణానంత సరస్వతి వ్యవహారం సంచలనం రేపింది. ఆమెతో పాటు మరో బాలికపై కూడా అఘాయిత్యానికి పాల్పడినట్లు సదరు బాలిక స్టేట్‌మెంట్ ఇవ్వడంతో పోలీసులు స్వామీజీని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. అలాగే గతంలో జరిగిన విషయాలపై ఆరా తీస్తున్నారు.

'స్వామీజీపై సమగ్ర విచారణ చేపట్టాలి'



నిరసన తెలియజేస్తున్న ఐద్వా, సిటు, డీవైఎఫ్ఐ సంఘాల ప్రతినిధులు

మద్దిలపాలెం: వెంకోజీపాలెంలోని జ్ఞానానంద రామానంద ఆశ్రమంలో బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న సంపూర్ణనందా స్వామిపై సమగ్ర విచారణ చేపట్టి.. కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు బి.పద్మ డిమాండ్ చేశారు. మద్దిలపాలెం బస్టాప్ వద్ద ఐద్వా, సీఐటీయూ, డీవైఎఫ్ఐ సంఘాల ఆధ్వర్యంలో ఈ ఘటనపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పద్మ మాట్లాడుతూ పగలంతా వెట్టి చాకిరి, రాత్రి వేళల్లో లైంగిక వేధింపులకు గురి చేస్తున్న స్వామీజీ నిజ స్వరూపం బయటపడిందన్నారు. ఆశ్రమంలో న్యాయవిచారణతోపాటు సోషల్ ఆడిట్‌చేయాలన్నారు.

ప్రజా భద్రత విషయంలో రాజీపడేది లేదు

- మా ఎంపీ కుటుంబ సభ్యుల కిడ్నాప్ ఘటన బాధాకరం
- విశాఖలో శాంతిభద్రతలు అదుపులోనే ఉన్నాయి
- టీటీడీ చైర్మన్, వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి


ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ కుమారుడిని పరామర్శిస్తున్న టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి

సాక్షి, విశాఖపట్నం: ప్రజా భద్రత విషయంలో రాష్ట్ర ప్రభుత్వం రాజీ పడే ప్రసక్తే లేదని టీటీడీ చైర్మన్, వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. తమ పార్టీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ కుటుంబ సభ్యుల కిడ్నాప్ ఘటన బాధాకరమన్నారు. సంఘటన జరిగిన తీరు ఊహించుకుంటే మనసును కలచివేసిందన్నా రు. ఈ విషయంలో పార్టీలతీతంగా ఎంపీ కుటుంబానికి అండగా నిలవాలే తప్ప విమర్శలు చేయడం తగదన్నారు. సర్క్యూట్ హౌస్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కిడ్నాపర్లపై 45 క్రిమినల్ కేసులు ఉన్నాయని, అందులో ఒకరిపై రౌడీషీట్ ఉందని పోలీసులు చెబుతున్నారని తెలిపారు. ఏదైనా సంఘటన జరిగినప్పుడు.. దాన్ని ఛేదించే క్రమంలో పోలీసులకు కొంత సమయం పడుతుందని.. ఇంతలోనే ఓ వర్గం మీడియా ప్రచురిస్తున్న కథనాలు బాధ కలిగిస్తున్నాయని చెప్పారు. విశాఖలో శాంతి భద్రతలు పూర్తిగా అదుపులోనే ఉన్నాయన్నారు. జరిగిన సంఘటనను దృష్టిలో పెట్టుకుని మీడియా గానీ, ప్రతిపక్షాలు గానీ హుందాగా వ్యవహరించాలన్నారు. ఈ కిడ్నాప్‌కు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు.

పెద్దల సలహాలు పాటించాలి

'కాపు నేత ముద్రగడ పద్మనాభం రాజకీయంగా అనుభవం ఉన్న వ్యక్తి. కాపు రిజర్వేషన్ కోసం పోరాటం చేసిన సీనియర్ నాయకుడు. అలాంటి పెద్దల సలహాలు పాటిస్తే.. రాజకీయ భవిష్యత్ ఉంటుంది. అందులో భాగంగానే జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు ఒక లేఖలో సూచనలు చేశారు. పాటిస్తే పవన్ రాజకీయంగా ముందుకెళ్తాడు. లేదంటే చంద్రబాబు వలలో పడి రాజకీయ భవిష్యత్‌ను శూన్యం చేసుకుంటాడు' అని సుబ్బారెడ్డి అన్నారు. వైఎస్సార్ సీపీనో, ఇంకా ఎవరైనా చెబితే చేసేటివంటి నాయకుడు ముద్రగడ కాదని, ఆయనకంటూ ఆత్మసాక్షి ఉందన్నారు. ఆ ప్రకారమే పవన్‌కు సూచనలు చేస్తూ లేఖ రాసి ఉంటారని సుబ్బారెడ్డి అభిప్రాయపడ్డారు.

ఎంపీ కుటుంబ సభ్యులకు పరామర్శ

ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ కుటుంబ సభ్యులను వై.వి.సుబ్బారెడ్డి పరామర్శించారు. లాసన్స్‌బే కాలనీలోని ఎంపీ నివాసానికి మంగళవారం ఆయన వెళ్లారు. ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ఆయన భార్య జ్యోతి, కుమారుడు శరత్, ప్రముఖ ఆడిటర్ జి.విలను పరామర్శించి.. సంఘటన గురించి అడిగి తెలుసుకున్నారు.

యోగా మార్గం.. ఆరోగ్య భాగ్యం

నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం

మనిషి అనంతమైన మేధాశక్తి, ఆత్మ శక్తిల కలయికే యోగా.. యోగా అనేది వ్యాయామ పద్ధతి కాదు. మనిషి తను చేరుకోగల అత్యున్నత స్థితికి చేరవేసే సంపూర్ణ సాధన ప్రక్రియ. మనల్ని శారీరకంగా.. మానసికంగా దృఢంగా మార్చడంలో ప్రభావవంతంగా పనిచేస్తుంది. యోగా విశిష్టతను ప్రజలకు వివరించడంలో నగరానికి చెందిన పలువురు విశేష సేవలందిస్తున్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగాకు అంకితమైన వారి గురించి తెలుసుకుందాం. – విశాఖపట్నం డెస్క్


గాదిరాజు ప్యాలెస్ వేదికగా ఆసనాలు వేయిస్తున్న శిక్షకుడు రమేష్(ఫైల్)

అలా.. జీవనయోగం

జీవితంలో ఎదురయ్యే కష్టం, సుఖం, దుఃఖం, సంతోషం.. ప్రతీది ఒక అనుభవమే. సుఖాలకు మురిసి.. కష్టాలకు కుంగిపోతే జీవితం అక్కడే నిలిచిపోతుంది. నిస్సారం అవుతుంది. అలా కాకుండా ప్రతి అనుభవం నుంచి గుణపాఠం నేర్చుకుని.. ప్రగతి మార్గంలో పయనించి.. ప్రజలకు సేవ చేసే వారి జన్మ సార్థకం అవుతుంది. ఇదే కోవకు చెందుతారు నగరానికి చెందిన చిలకా వెంకట రమేష్. ఎంవీపీ కాలనీ సెక్టార్–11 ప్రాంతంలో నివాసం ఉండే రమేష్.. తమ జీవన గమనంలో ప్రతి మలుపునూ సవాలుగా తీసుకుని విజయవంతమయ్యారు.

అది 2002.. ఏలూరు రైల్వే స్టేషన్‌లో జరిగిన బాంబు పేలుడులో అనేక మంది క్షతగాత్రులయ్యారు. వారిలో రమేష్ కూడా ఉన్నారు. ఎమ్మెస్సీ చదివి ఈ సేవ కేంద్రం మేనేజర్‌గా పనిచేస్తున్న సమయంలో రమేష్ ఆనందమయ జీవితాన్ని ఈ భయానక ఘటన కుదిపేసింది. ఈ ఘటనలో ఆయన కాలికి తీవ్ర గాయమైంది. దానికి చికిత్స చేయించుకున్నా.. దాని వెంబడి ఇతర అనారోగ్య సమస్యలు కబళించాయి. సైనస్, తీవ్రమైన తలనొప్పి, శరీర బరువు అపరిమితంగా పెరగడం వంటి సమస్యలతో ఎక్కువ కాలం ఇంటికే పరిమితం కావాల్సి వచ్చింది. అయినా రమేష్ కుంగిపోలేదు. తన సమస్యలకు పరిష్కారం ఏమిటా అని ఆలోచించారు.. శోధించారు. కష్టాలు శత్రువులు కాదు.. మన బలాన్ని, బలహీనతలను తెలియజేసే స్నేహితులు.. అని భావించారు. ఈ క్రమంలో ఆయన దృష్టి యోగా వైపు మళ్లింది. భీమిలిలోని యోగా కాన్షియస్‌నెస్ ట్రస్ట్‌లో చేరి 2012లో యోగాలో ఏడాది పీజీ డిప్లమో కోర్సు చేశారు. అనంతరం అక్కడే యోగా శిక్షకుడిగా ఉచిత సేవలు అందించారు. నిరంతర యోగా సాధనతో సాధకుడిగా మారిన ఆయన ఆరోగ్య సమస్యలు కూడా తొలగిపోయి జీవన యోగం పొందారు. శారీరక, మానసిక ప్రశాంతతనిచ్చే యోగాను అందరికీ పరిచయం చేయాలన్న సంకల్పంతో తానే స్వయంగా రోజూ మూడు చోట్ల శిక్షణ ఇవ్వడం ప్రారంభించారు. పలు సంస్థల ఆహ్వానంపై ఆయా కార్యాలయాలకు కూడా వెళ్లి ఉచిత శిక్షణ ఇచ్చేవారు. అలా ఎన్నో వేల మందికి యోగాను దరిచేర్చారు.

'ఓం' సంస్థ ఆవిర్భావం

2015లో ఓం అనే సంస్థను స్థాపించి తన సేవలను మరింత విస్తృతం చేశారు. ఒకవైపు నిర్మాణ రంగంలో బిజీగా ఉంటూ.. మరో వైపు సంస్థను విజయపథంలో నడిపిస్తున్నారు. కరోనా సమయంలో నేరుగా శిక్షణ ఇచ్చే పరిస్థితి లేకపోవడంతో ఆన్‌లైన్ శిక్షణ తరగతులు ప్రారంభించి.. ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. రోగాలను నయం చేసే ఎంతోమంది వైద్యులు సైతం రమేష్ వద్ద యోగా శిక్షణ తీసుకుంటున్నారు. ఆయన భార్య ప్రియాంక కూడా యోగాలో పీజీ డిప్లమో చేశారు. వీరి కుమార్తెలు జాగృతి, ప్రశస్థ కూడా చిన్నతనం నుంచే యోగా అలవరచుకున్నారు. క్లిష్టమైన ఆసనాలను సునాయాసంగా వేస్తూ ప్రశంసలు పొందుతున్నారు. ఉద్యోగం కూడా విడిచిపెట్టి తన జీవితాన్ని, కుటుంబాన్ని యోగాకు అంకితం చేసిన చిలకా వెంకట రమేష్‌కు యోగాభివందనాలు.

యోగా సర్వరోగ నివారిణి



యోగా సాధనతో నేనెంతో ప్రయోజనం పొందాను. మానసిక ప్రశాంతత లభించింది. ప్రతి ఒక్కరూ నాలా ఎంతో కొంత ప్రయోజనం పొందాలనే ఉద్దేశంతో ఓం యోగా శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించి రోజుకు 5 బ్యాచ్‌లకు శిక్షణ ఇస్తున్నాను. ఇప్పటి వరకు 5వేల మందికి పైగా యోగా శిక్షణ ఇచ్చాను. సంస్థల ఆహ్వానం మేరకు ఆయా చోట్ల ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తుంటాను. యోగా ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలి. యోగా దినోత్సవం సందర్భంగా గాదిరాజు ప్యాలెస్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నాం. యోగాలో శిక్షణతో పాటు నెలలో రెండు మూడు సేవా కార్యక్రమాలు చేపడుతుంటాను.

– రమేష్, నిర్వాహకుడు ఓం యోగా శిక్షణ కేంద్రం

ప్రకృతి ఒడిలో యోగా సాధన


దనురాసనంలో...

సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణకు యోగా రక్షణ కవచం వంటిదని అన్ని వర్గాల ప్రజలు గుర్తించారు. యోగాసనాల అభ్యసనకు వయసుతో సంబంధం లేదని వృద్ధులు సైతం నిరూపిస్తున్నారు. ప్రభాత వేళ శిల్పారామంలో క్లిష్టమైన యోగాసనాలు సాధన చేస్తూ ఔరా అనిపిస్తున్నారు. 60 ఏళ్ల బాలకృష్ణ ఆచార్య చక్రాసనం, ఉష్ట్రాసనం, ధనురాసనం, తులాసనం తదితర కష్టతరమైన ఆసనాలను నిత్యం సాధన చేస్తున్నారు. 57 ఏళ్ల ఎంబీ కామేశ్వరరావు సూర్య నమస్కారాల సాధనలో దిట్ట. యోగా పట్ల అభిరుచి ఉన్న వారికి ఉచితంగా ఆసనాలు వేయడంలో శిక్షణ ఇస్తుంటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతీయ వారసత్వ సంపద అయిన యోగా సాధన ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందడంతో పాటు దీర్ఘకాల వ్యాధులు మటుమాయం అవుతాయని అనుభవపూర్వకంగా తెలుసుకున్నట్లు చెప్పారు. క్రమశిక్షణ, ఆధ్యాత్మికత, ప్రశాంతమై జీవన విధానం అలవడుతుందన్నారు. పచ్చని చెట్లతో నిండిన శిల్పారామం వంటి ప్రశాంత వాతావరణం యోగా సాధనకు ఎంతో అనుకూలంగా ఉంటుందన్నారు.

60 ఏళ్ల వయసులో అబ్బురపరిచే ఆసనాలు




గాజువాకలోని రామచంద్రనగర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వి.కృష్ణవేణి 60 ఏళ్ల వయసులోనూ క్లిష్టమైన ఆసనాలు వేస్తూ అబ్బురపరుస్తున్నారు. ఆసనాలు వేద్దాం.. ఆరోగ్యంగా ఉందాం నినాదంతో యోగాపై ప్రచారం చేస్తూ ఎంతో మందికి ఉచిత శిక్షణనిస్తున్నారు. అరవైలోనూ ఆమె ఇరవైలా రెట్టించిన ఉత్సాహంతో ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారు. 'అందరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే నా లక్ష్యం. యోగాతో అది సాధ్యమవుతుందని నేను నమ్ముతున్నాను. 16 ఏళ్లుగా యోగా సాధన చేస్తున్నాను. అందుకే ఆరోగ్యంగా ఉండగలుగుతున్నాను.' అని యోగా గురు కృష్ణవేణి తెలిపారు.

లక్ష మందికి యోగా.. అదే అతని ధ్యాస




యోగసనాలు, ధ్యానం, ప్రాణాయామం.. ఇవి మూడే మనిషి సుఖవంతమైన జీవనానికి మార్గాలంటారు యోగా భారతి ట్రస్ట్ వ్యవస్థాపకుడు పైడం నాయుడు. ప్రముఖ యోగా గురువుగా నగర వాసులకు ఆయన సుపరిచితులు. 30 ఉచిత యోగా శిబిరాల ద్వారా నిత్యం నగరవాసులకు సుఖమయ జీవనానికి మార్గం చూపిస్తున్నారు. ప్రతీ వ్యక్తిలో దాగి ఉన్న సామర్థ్యాన్ని యోగాతో వెలికితీయడం ద్వారా ఒత్తిడిని, శారీరక సమస్యలను పరిష్కరించవచ్చంటారాయన. పుస్తక విజ్ఞానం ద్వారా యోగా విశిష్టతను తెలుసుకున్న పైడం నాయుడు బెంగళూరులోని ప్రసిద్ధ వివేకానంద యోగా అనుసంధాన్ సంస్థాన్‌లో 2010–11లో యోగా శిక్షణలో ఏడాది కోర్సు పూర్తి చేశారు. థెరపీయోగాతో ఏ ఆసనం ద్వారా ఏ శారీరక సమస్యకు ఉపశమనం పొందవచ్చో తెలుసుకున్నారు. తాను నేర్చుకున్న యోగా విజ్ఞానం, ఆసనాల ద్వారా ప్రజల అనారోగ్య సమస్యలకు పరిష్కారం చూపాలని సంకల్పించారు. 2012లో నగరంలో యోగా భారతి ట్రస్ట్ ఏర్పాటు చేసి 10 వేల మందిని భాగస్వాములను చేస్తూ విస్తృతంగా ఉచిత యోగా శిబిరాలు నిర్వహించారు. లక్ష మందికి యోగా నేర్పించాలనే ఆయన సంకల్పం అక్కడితో ఆగలేదు. ఈ యజ్ఞం ఒకరితో సాధ్యం కాదని భావించి తన సొంత ఖర్చులతో నగరానికి చెందిన 30 మందికి యోగాసనాల్లో ఉచిత శిక్షణ అందించి.. శిక్షకులుగా తీర్చిదిద్దారు. తద్వారా నగర వ్యాప్తంగా 30 ఉచిత యోగా శిబిరాల నిరంతర సేవలకు బాటలు వేశారు. మధురవాడ, కొమ్మాది, ఆరిలోవ, హెల్త్ ఎరీనా, స్వర్ణభారతి, మాధవధార, సుజాతనగర్ ఇలా 30 శిబిరాల ద్వారా రోజు నగర వాసులకు ఉచితంగా యోగా శిక్షణ అందిస్తున్నారు. కోవిడ్ విజృంభించిన సమయంలో సైతం ఆన్‌లైన్ ద్వారా ఉచిత యోగా శిక్షణ అందించి నగర ప్రజల ఆరోగ్య పరిరక్షణపై తనకున్న నిబద్ధతను చాటుకున్నారు. 2012 నుంచి నిరంతరాయంగా నగర వాసులకు ఉచిత యోగా శిక్షణ అందిస్తూ.. అందరి మన్ననలు అందుకుంటున్నారు పైడం నాయుడు.

నాలుగు గంటల్లోనే చోరీ కేసు ఛేదన


వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ సునీల్

బీచ్‌రోడ్డు: చోరీ జరిగిన నాలుగు గంటల వ్యవధిలోనే పోలీసులు కేసును ఛేదించి.. నిందితుడి నుంచి సొత్తును స్వాధీనం చేసుకున్నారు. మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఈ కేసు వివరాలను తూర్పు ఏసీపీ సునీల్ మీడియాకు వెల్లడించారు. మంగాపురంకాలనీ తారా మసీదు రోడ్డులో ఓ వీధిలోని ఒక ఇంట్లో రూ.12 వేలు, మరో ఇంట్లో రూ.19,200 విలువైన బంగారం ఆభరణాలు చోరీకి గురయ్యాయి. దీంతో బాధితులు డయల్ 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. విచారణ ప్రారంభించిన మూడో పట్టణ పోలీసులు సీసీ ఫుటేజ్ ద్వారా కేవలం నాలుగు గంటల వ్యవధిలో నిందితుడు మరడ సాయి(సార పిట్టలు)ను అదుపులోకి తీసుకున్నారు. కొమ్మాది ప్రాంతానికి చెందిన సాయి చెడు వ్యసనాలకు బానిసై.. దొంగతనాలు చేయడం ద్వారా వచ్చే సొత్తుతో జల్సాలు చేస్తున్నాడు. ఈ రెండు కేసుల్లో సాయి స్క్రూడ్రైవర్ సాయంతో ఇళ్ల తలుపులు తీసి.. బీరువాలోని నగలను చోరీ చేసినట్లు ఏసీపీ తెలిపారు. పెదజాలరిపేట వద్ద సాయిని చాకచక్యంగా పట్టుకున్నట్లు చెప్పారు. అతనిపై రెండు కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా.. సాయిపై ఇప్పటికే 13 కేసులు నమోదై ఉన్నాయి. ఈ కేసును ఛేదించిన ఎస్‌ఐ సురేష్ కుమార్, ఏఎస్‌ఐ కిశోర్ కుమార్, కానిస్టేబుల్ అప్పలరాజు, రవికుమార్‌లను ఏసీపీ అభినందించారు.

రోగులు, వారి సహాయకులకు 'సుభోజనం'


సుభోజనం చేస్తున్న రోగుల సహాయకులు

అగనంపూడి (గాజువాక): ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులు, వారి సహాయకులకు సమయానికి భోజనం అందుబాటులో ఉండదని, దీన్ని దృష్టిలో పెట్టుకొని హరేకృష్ణ మూమెంట్ దాతల సహకారంతో సుభోజన కార్యక్రమాన్ని చేపట్టిందని హరేకృష్ణ మూమెంట్ అధ్యక్షుడు నిష్కించిన భక్త దాస అన్నారు. హరేకృష్ణ మూమెంట్ సహకారంతో, టచ్‌స్టార్ చారిటీస్ సౌజన్యంతో అగనంపూడిలోని హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రిలో సుభోజన కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హరేకృష్ణ మూమెంట్ వ్యవస్థాపకులు శ్రీలభక్తి వేదాంతస్వామి ప్రభు పాదల ఆశయం మేరకు 12 ఏళ్ల క్రితం దాతల సహకారంతో కేజీహెచ్‌లో సుభోజన కార్యక్రమం ప్రారంభించి రాష్ట్రంలోని పలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో దిగ్విజయంగా కొనసాగిస్తున్నామన్నారు. వివిధ సంస్థలు, దాతలు శుభకార్యాల సందర్భంగా వారి దాతృత్వాన్ని చాటుకుంటున్నారన్నారు. క్యాన్సర్ ఆస్పత్రికి వివిధ రాష్ట్రాల నుంచి రోగులు చికిత్స కోసం వస్తున్నారని, వీరి సహాయకులు క్యాన్సర్ బాధితులను వదిలి బయటకు వెళ్లలేక పస్తులు ఉంటున్నారన్నారు. ఆస్పత్రి డైరెక్టర్ ఉమేష్ మహంతి శెట్టి మాట్లాడుతూ హరేకృష్ణ మూమెంట్ సంస్థ రోగులు, వారి సహాయకులపై చూపుతున్న ఉదారత మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో సుభోజన సమన్వయకర్త పిల్లల షణ్ముఖరావు, విశాఖ ఇన్‌చార్జ్ యదురాజా దాస తదితరులు పాల్గొన్నారు.

బ్రాండెడ్ దుస్తుల అమ్మకాలకు విశేష స్పందన


సందర్శకులతో కిటకిట

బీచ్‌రోడ్డు: నాణ్యత కలిగిన ప్రముఖ బ్రాండెడ్ దుస్తులు అమ్మకాల ప్రదర్శనకు నగరవాసుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఈ నెల 17వ తేదీ నుంచి బీచ్‌రోడ్డులోని పామ్ బీచ్ హోటల్‌లో ఏర్పాటు చేసిన బ్రాండెడ్ దుస్తులు అమ్మకాలు నగరవాసులను ఆకర్షిస్తున్నాయి. రేమాండ్స్, పార్క్ అవెన్యూ, యారో, ఫ్లయింగ్ మిషన్, రీబాక్, జాన్ మిల్లర్ వంటి బ్రాండెడ్ దుస్తులు, లేడీస్ అండ్ జెంట్స్, పిల్లలకు అందుబాటులో ఉన్నాయని నిర్వాహకురాలు గౌరీ తెలిపారు. బ్రాండెడ్ దుస్తుల ధరలపై 80 శాతం వరకు తగ్గింపు లభిస్తుందన్నారు. రూ.1200 నుంచి రూ.6,000 విలువ చేసే దుస్తులు రూ.500 నుంచి రూ.1000లకే లభిస్తాయన్నారు. శుక్రవారం వరకు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఈ అమ్మకాలు అందుబాటులో ఉంటాయిని తెలిపారు.

నేటి నుంచి వార్షిక క్రీడా పోటీలు


వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్

విశాఖ స్పోర్ట్స్: ఏఎంసీ సెంటినరీ వేడుకల్లో భాగంగా వార్షిక క్రీడాపోటీలు పేస్ 23 పేరిట బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మేజర్ ఎడ్విన్ స్మారక గ్రౌండ్‌లో ఫ్యాకల్టీ కోసం క్రికెట్, త్రోబాల్, చెస్, క్యారమ్, టీటీ, బ్యాడ్మింటన్ పోటీలు జరగనున్నాయి. మెన్, వుమెన్ స్టూడెంట్స్‌కు క్రికెట్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, బాల్‌బ్యాడ్మింటన్, బ్యాడ్మింటన్, త్రోబాల్, టెన్నిస్, టీటీ, చెస్, క్యారమ్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఏఎంసీ ప్రిన్సిపాల్ జి.బుచ్చిరాజు పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఆర్.సునీల్‌కుమార్, నిర్వాహక ప్రతినిధులు కార్తీక్, హర్షిత, చెన్నకేశవ, శివసత్య పాల్గొన్నారు.

బాలికపై వృద్ధుడి అత్యాచారయత్నం


నిందితుడిని పోలీసులకు అప్పగిస్తున్న స్థానికులు

గోపాలపట్నం: నాలుగేళ్ల బాలికపై 60 ఏళ్ల చినప్పారావు అత్యాచారం చేసేందుకు యత్నించాడు. ఎన్‌ఏడీ జంక్షన్ ఫ్లైఓవర్ దిగువన ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలివీ..ఎన్‌ఏడీ ఫ్లై ఓవర్ దిగువన యాచకుడు సతీష్, భార్యాపిల్లలతో కొన్నాళ్లుగా నివాసముంటున్నాడు. ఇటీవల భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో భార్య పెద్ద కూతురితో వెళ్లిపోయింది. తండ్రితోనే చిన్న కుమార్తె ఉంది. మంగళవారం సాయంత్రం 6.30 గంటల సమయంలో చిత్తు కాగితాలు ఏరుకునే కంచరపాలెం ప్రాంతానికి చెందిన చినప్పారావు నిద్రిస్తున్న చిన్నారిని ముద్దులాడుతూ కనిపించాడు. అటుగా వెళ్తున్న ఓ మహిళ ఇది గమనించి.. ప్రేమతో ముద్దులాడుతున్నాడని అనుకుంది. అయితే బాలికపై అత్యాచారానికి యత్నిస్తున్నట్లు గమనించి కేకలు వేసింది. చిన్నపిల్లరా అంటూ అతన్ని కొట్టింది. ఇంతలో తండ్రి నిద్ర లేచి అతనికి దేహశుద్ధి చేశాడు. సమాచారం అందుకున్న ఎయిర్‌పోర్టు పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వృద్ధుడిని స్టేషన్‌కు తరలించారు. సీఐ బీఎండీ ప్రసాద్ ఘటనా స్థలానికి వచ్చి విచారించారు. తాగిన మత్తులో ఈ విధంగా ప్రవర్తించాడని స్థానికులు చెబుతున్నారు.

● చిరుజల్లులతో చల్లబడిన నగరం




చిరుజల్లులతో నగరం చల్లబడింది. మంగళవారం రాత్రి 9 గంటల తరువాత విశాఖలో ఓ మోస్తరు వర్షం కురిసింది. చల్లని గాలులు ఆహ్లాదం కలిగించాయి. వాతావరణంలో చల్లగా మారడంతో సిటిజనులు ఉపశమనం పొందారు. -ఏయూక్యాంపస్